
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
గురువారం 7 మార్చి 2024



హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు ఆహ్వానం: ఆర్టీవో

విజయనగరం రింగురోడ్డు, మార్చి 6: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ)కి సంబంధించిన డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్టు జిల్లా ప్రజారవాణాధికారి సీహెచ్ అప్పలనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకూ 10 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చామన్నారు. 16వ బ్యాచ్ శిక్షణ త్వరలో ప్రారంభమౌతుందన్నారు. 40 రోజుల పాటు మెలకువలతో శిక్షణ అందిస్తామని, మెకానికల్ వర్క్, ఫస్ట్ ఎయిడ్ ట్రాఫిక్ నిబంధనలు, యోగాకి సంబంధించిన శిక్షణ కూడా ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫోన్: 73829 24030ను సంప్రదించాలని పేర్కొన్నారు.




లింగేశ్వరా.. ఇక్కట్లు తప్పించు!



ఎస్.కోట పుణ్యగిరి ఆలయం

- ఎస్.కోట పుణ్యగిరి మహాశివరాత్రి జాతర రేపే
- కేవలం రెండురోజుల ముందు మొక్కుబడి సమావేశం
- కొండపై పాడైన మెట్లు.. దెబ్బతిన్న రెయిలింగ్
- లక్ష మంది భక్తులు కొండపైకి వచ్చే అవకాశం

పుణ్యగిరి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు అన్ని శాఖల అధికారుల సమావేశం తప్పనిసరి. ఏ శాఖకు సంబంధించిన పనులు ఆ శాఖ వారు చేపట్టేందుకు కనీసం వారం, పది రోజులైన సమయం అవసరం. గతంలో ఈ విధంగానే స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించేవారు. మొదటి సమావేశంలో ఆయా శాఖలు చేయాల్సిన పనుల వివరాలను సూచించి, జాతర రెండు రోజులు వుందనగా పనులు ఎంతవరకు వచ్చాయో ఆరా తీసేవారు. ఈ సమయంలో జిల్లా స్థాయి అధికారులు కూడా వచ్చి పనులను పరిశీలించేవారు. ఈ ఏడాది అలాంటి సాంప్రదాయమేదీ పాటించలేదు. కేవలం రెండురోజులు ముందు మంగళవారం వివిధ శాఖల అధికారులతో తూతూ మంత్రంగా సమావేశం ఏర్పాటు చేసి మమ అనిపించారు.



పాడైన పుణ్యగిరి మెట్ల మార్గం

రూ.5 లక్షలతో భక్తులకు ఏర్పాట్లు

పుణ్యగిరి జాతరలో భక్తులకు సదుపాయాలు కల్పించేందుకు దేవదాయ శాఖ రూ.5లక్షలు కేటాయించింది. గోపురానికి రంగులు వేయించాం. పారిశుధ్య పనులు చేపడతాం. విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నాం. తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో ఉంటాయి. పోలీస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి భోజన సదుపాయం కల్పిస్తాం.

\- నాగేంద్ర, కార్యనిర్వాహక అధికారి, పుణ్యగిరి దేవస్థానం

ఏర్పాట్లు చేస్తున్నాం

పుణ్యగిరి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా వుండేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీల సమావేశంలో శాఖల వారీగా సదుపాయాలు కల్పించాలని సూచించాను. దేవదాయ, పంచాయతీ, విద్యుత్, అగ్నిమాపక, వైద్యశాఖ అధికారులను భాగస్వామ్యం చేస్తున్నాం.

\- కిరణ్‌కుమార్, తహసీల్దార్, ఎస్.కోట

శృంగవరపుకోట, మార్చి 6:
శృంగవరపుకోట పుణ్యగిరి దక్షిణ కాశీగా పేరొందింది. మహా శివరాత్రి పర్వదినాన జిల్లాతో పాటు పక్కన వున్న విశాఖపట్నం, అల్లూరిసీతారామరాజు, అనకాపల్లి, పార్వతీపురం, శ్రీకాకుళం, ఒడిశా రాష్ట్రం నుంచి కూడా భక్తులు వస్తారు. శివరాత్రి జాగారం చేసే భక్తులు ఆ రోజు అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు సాయంత్రం వరకు లక్షమంది పైబడి కొండపైకి వెళ్తారు. శ్రీదారగంగమ్మలోయ జలపాతం, శ్రీఉమాకోటి లింగేశ్వరస్వామి పాదాలను తాకుతూ వచ్చే పాతాల గంగ పుట్టదార జలపాతం వద్ద స్నానాలు ఆచరిస్తారు. గుంపులు, గుంపులుగా వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రభుత్వ అధికారులు చూసుకోవాలి. కానీ ఈ ఏడాది ఇటువంటి ప్రయత్నాలేవీ జరగడం లేదు.

ఇవీ సమస్యలు

- శృంగవరపుకోట దేవిబొమ్మ కూడలి నుంచి పుణ్యగిరి కొండకు రెండు కిలోమీటర్లుపైబడి ఉంటుంది. ఈ రోడ్డుంతా గతుకులమయమైంది. ఎదురుగా ఒక వాహనం వస్తే మరో వాహనం తప్పించుకోవడం కష్టం. రోడ్డును విస్తరిస్తామన్న ప్రజాప్రతినిధులు గాలికి వదిలేశారు. పంచాయతీ అధికారులు రోడ్డుకు ఇరుపక్కల పొదలను మాత్రమే తొలగించగలుగుతున్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు.
- భక్తులు ఉమాకోటిలింగేశ్వర స్వామిని దర్శించుకోవాలంటే కొండెక్కాలి. 314 మెట్లు దాటి రావాలి. అవన్నీ పాడయ్యాయి. రెయిలింగ్ దెబ్బతింది. దీనికి ఏటా రంగులు వేసే దేవదాయ శాఖ అధికారులు ఈ ఏడాది ఆపనీ చేయలేదు. మెట్ల దారితో పాటు ఆలయ పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి.
- శివరాత్రి, కార్తీకమాస సమయాల్లో ఏటా మెట్ల మార్గంలో తోపులాట జరుగుతుంటుంది. దీన్ని నివారించేందుకు దారగంగమ్మలోయ నుంచి కొండపైకి మరో పక్క రోడ్డును వేస్తున్నట్లు వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రకటించారు. నేటికీ నిర్మించలేదు. ఏటా శివరాత్రి సమయంలో మట్టిని చదును చేసి వదిలేస్తున్నారు.
- స్నానపు ఘట్టాలు పుట్టదార, శ్రీదార గంగమ్మ లోయ వద్ద ఏర్పాట్లు అంతంతమాత్రంగా వున్నాయి. తోపులాటను నివారించేందుకు క్యూ ఏర్పాట్లు చేయాలి. ఇంతవరకు ఇవేమీ చేయలేదు.

రామతీర్థంలో మహా శివరాత్రి జాతర



ఇలా చేరుకోవాలి

విజయనగరానికి 12 కిలోమీటర్ల దూరంలోనూ మండల కేంద్రం నెల్లిమర్లకు 5 కిలోమీటర్ల దూరంలోనూ ఈ ఆలయం ఉంది. నెల్లిమర్ల నుంచి ఆటోల ద్వారా రవాణా సదుపాయం ఉంటుంది. శివరాత్రిని పురస్కరించుకుని రామతీర్థానికి ఏపీఎస్ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు కేటాయిస్తారు.

నెల్లిమర్ల: రామతీర్థం రామస్వామి వారి దేవస్థానం వద్ద ఈ నెల 8వ తేదీ శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు శివరాత్రి జాతర పెద్ద ఎత్తున జరుగనుంది. రాముడి గుడి ఉన్న రామతీర్థంలో శివరాత్రి జాతర జరగడం ఒకింత ఆశ్చర్యమే అయినా దీనికి కూడా చారిత్రక కథనం ఉన్నట్లు పూర్వీకులు చెబుతుంటారు. రావణాసురుడ్ని సంహరించిన శివ భక్తుడైన శ్రీరాముడు శివరాత్రి పర్వదినం నాడు ఉపవాసంతో శివుడ్ని పూజిస్తాడని కథనం. అందువల్ల శివరాత్రి నాడు శ్రీరాముడ్ని దర్శించుకుని పూజలు చేస్తే ముక్తి, మోక్షం లభిస్తాయని భక్తుల నమ్మకం. జాతరను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు.

- భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాలకు చెందిన మత్స్యకారులతో పాటు శ్రీకాకుళం జిల్లా పరిధిలోని రణస్థలం, లావేరు తదితర మండలాలకు చెందిన మత్స్యకారులు ఈ జాతరకు వచ్చి అదే రోజు రాత్రి జాగరణ చేస్తారు.

ఎన్నెన్నో ప్రత్యేకతలు

ఇక్కడి బోడికొండపై ఉన్న చారిత్రక ఆధారాలను చూస్తే పర్యాటకులు ముగ్ధులవుతారు. పాండవులు ఈ కొండపై సంచరించినట్లు చెబుతారు. కొండ పైకి ఎక్కగానే తొలుత కనిపించేది కోదండరాముని ఆలయం. ఆ పక్కనే నీటి మడుగు ఉంటుంది. ఈ మడుగులోతు ఎంతో ఇంతవరకు ఎవరూ తెలుసుకోలేకపోయారు. కొండపై భీముడి గుహ, భీముడి బుర్ర అనే ప్రాంతాలు ఉన్నాయి. అంతేకాకుండా బౌద్ధారామ ఆనవాళ్లున్నాయి. బౌద్ధులు నిర్మించుకున్న గదులు, సమావేశ మందిరాల ఆనవాళ్లు ఇప్పటికీ ఉన్నాయి. వీటిని చూసేందుకు కూడా పర్యాటకులు ఎప్పటికప్పుడు ఇక్కడకు వస్తుంటారు.

కోలగట్లను చూసి ఓటెయ్యాలంట!

- పార్టీని చూడొద్దని చెబుతున్న ఎమ్మెల్యే
- జగన్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతే కారణం!
- ఆశ్చర్యపోతున్న అధికారపార్టీ శ్రేణులు, ఓటర్లు
- వారం రోజులుగా ఉద్యోగ సంఘాలతో సమావేశాలు
- పోస్టల్ బ్యాలెట్లు కొల్లగొట్టేందుకు ముందస్తు వ్యూహం
- వలంటీర్లు, ఉద్యోగ సంఘాలకు బహుమతులు
- తాయిలాలపై నిఘా ఏదీ?

'పార్టీని కాదు నన్ను చూసి ఓటేయండి. మీకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తా. నాలుగేళ్లుగా ఉద్యోగులకు అనేక విధాలుగా సహాయపడ్డాను. మీరు డిమాండ్ చేస్తున్న సీపీఎస్ రద్దు, సకాలంలో జీతాలు వంటి అంశాలు నా పరిధిలో లేనివి. వీటిని దృష్టిలో పెట్టుకుని మీరు నాకు వ్యతిరేకంగా ఉండడం సరికాదు.'

\- ఉపాధ్యాయ సంఘాలతో విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి మాటామంతీ

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

కోలగట్లకు వైసీపీ అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. కోలగట్లను జగన్ 'అన్నా' అని సంబోధించి గౌరవిస్తారు. ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు 2014, 2019 ఎన్నికల్లో అవకాశం కల్పించారు. 2019లో వైసీపీ టిక్కెట్టుపై పోటీ చేసి గెలుపొందారు. విజయనగరం కార్పొరేషన్ ఎన్నికల్లో 50 డివిజన్లలో కార్పొరేటర్ అభ్యర్థులను కోలగట్ల కోరుకున్న వారికే వైసీపీ అవకాశం కల్పించింది. అంతే కాదు. ఎమ్మెల్యే తన వద్ద పనిచేస్తున్న వ్యక్తి భార్యకు మేయర్ పదవి కట్టబెట్టాలని కోరితే దీనికి కూడా పార్టీ అంగీకరించింది. అంతటితో ఆగని ఎమ్మెల్యే తన కుమార్తెకు డిప్యూటీ మేయర్ పదవి కావాలని కోరితే అప్పుడూ పార్టీ సానుకూలంగానే స్పందించింది. కోలగట్లకు డిప్యూటీ స్పీకర్ పదవిని కట్టబెట్టి సముచిత స్థానం కల్పించింది. అటువంటి వైసీపీని కాదని తన మొఖం చూసి ఓటేయాలని కోరుతున్న ఆయన తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది. వైసీపీ లేకపోతే ఇన్ని పదవులు దక్కేవా అంటూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు. అంగన్వాడీలు, వలంటీర్లు ఎక్కడికక్కడ చర్చించుకుంటున్నారు.

వారం రోజులుగా సమావేశాలు

వలంటీర్లు.. అంగన్వాడీలతో వారం రోజులుగా ఎమ్మెల్యే సమావేశాలు నిర్వహించారు. మహిళలకు చీరలు, పురుష వలంటీర్లకు దుస్తులు అందించారు. ఈనెల 3న యూటీఎఫ్, 5న పీఆర్‌టీయూ, బుధవారం ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించారు. పట్టణంలోని రింగురోడ్డులో ఉన్న పేరడైజ్ ఫంక్షన్ హాలులో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పార్టీని కాదు తనను చూసి ఓటేయాలని ఎమ్మెల్యే ప్రస్తావించిన అంశాలు పట్టణంలో దావానలంలా వ్యాపించాయి. దీంతో ప్రతి పక్షాలు సైతం ఏమిటీ విపరీత ధోరణి అంటూ కోలగట్లపై విమర్శలు గుప్పిస్తున్నాయి.

వ్యతిరేకత ఉన్నందునే

ఉద్యోగ. ఉపాధ్యాయులు ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వంపై రగిలిపోయి ఉన్నారు. దీంతో వీరిని తనకు అనుకూలంగా మల్చుకునేందుకు కోలగట్ల వ్యూహం రచించారు. ఏకంగా పార్టీని పక్కన పెట్టి తనను చూసి ఓటేయాలని ప్రాధేయ పడటం ప్రారంభించారు. ఎమ్మెల్యే చెప్పిన మాటలు విని ఆయన పెట్టిన పంచభక్ష్య పరమాణాలు ఆరగించి, ఇచ్చిన బ్యాగులు స్వీకరించి నచ్చిన వారికి ఓటెయ్యాలన్నది ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల అభిప్రాయంగా కన్పిస్తోంది. అందుచేతే ఎమ్మెల్యే పిలిచిందే తడువుగా సమావేశాలకు హాజరవుతున్నారు.

పోస్టల్ బ్యాలెట్లపై దృష్టి

ఉద్యోగులు.. ఉపాధ్యాయులు ఎక్కువగా పోస్టల్ బ్యాలెట్ల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ఎక్కువ శాతం మంది ఉద్యోగులు, వీరి కుటుంబాలకు చెందిన ఓటర్లే అధికం. దీనిని గుర్తించిన కోలగట్ల ఉద్యోగుల ఓట్లపై దృష్టి పెట్టారు. గత వారం రోజులుగా సమావేశాల ద్వారా తమ వైపు ఈ వర్గాలను తిప్పుకునేందుకు శత విధాల ప్రయత్నిస్తున్నారు.

నిఘా ఏదీ

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో క్షేత్ర స్థాయిలో జరుగుతున్న రాజకీయ సమావేశాలు, బ్యాగులు, వస్త్రాల పంపిణీపై యంత్రాంగం దృష్టి పెట్టడం లేదు. అధికార పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు కావడంతో అధికారులు వారి జోలికి పోవటం లేదు. దీంతో అధికార పార్టీ నేతలు ఇష్టారాజ్యంగా పంపకాల్లో దూసుకు పోతున్నారు.

మిమ్మల్ని చూసి ఓటేయాలా?

- టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు

విజయనగరం రూరల్, మార్చి 6: పార్టీ, ఆ పార్టీ గుర్తుతో గెలిచి.. ఆ పార్టీని చూడకుండా అభ్యర్థిని చూసి ఓటేయాలని విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ప్రచారం చేయడం ఘోరమని, ఇదేమి రాజకీయమని టీడీపీ సీనియర్ నేత అశోక్‌గజపతిరాజు విమర్శించారు. విజయనగరంలోని 8వ డివిజన్ కార్పొరేటర్ ద్వాదశ సుమతి, వైసీపీ నాయకులు ద్వాదశ వేణు, ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నమ్మి ప్రసాద్‌లు వైసీపీని వీడి బుధవారం విజయ నగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ, ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్‌లో జలాసనం వేస్తానని ఎమ్మెల్యే కోలగట్ల హంగామా చేశారని, ఆయన ఆసనం వరకే స్విమ్మింగ్ పూల్ ప్రవేశం ఉచితమని, ఆ తరువాత నుంచి ఫీజులు వసూలు ప్రారంభించారన్నారు. కార్పొరేటర్ ద్వాదశ సుమతి, వైసీపీ నాయకులు ద్వాదశ వేణు, నమ్మి ప్రసాద్‌లు మాట్లాడుతూ, ఎమ్మెల్యే కోలగట్ల ఏకపక్ష నిర్ణయాలు, బంధుప్రీతి తదితర కారణాలతో తమ డివిజన్ ప్రజలకు కనీస సేవలు అందించలేక పోయామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, సువ్వాడ రవిశేఖర్, కనకల మురళీమోహన్, బొద్దల నర్సింగరావు, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, పిళ్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్ తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ కార్పొరేటర్ సుమతిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అదితి గజపతిరాజు, చిత్రంలో అశోక్‌గజపతిరాజు

సారిపల్లిలో గొడవ

ప్యాకేజీపై ఎమ్మెల్యేను నిలదీసిన రిజర్వాయర్ నిర్వాసితులు




ఎమ్మెల్యే బడ్డుకొండను ప్రశ్నిస్తున్న టీడీపీ నాయకులు, రిజర్వాయర్ నిర్వాసితులు

నెల్లిమర్ల, మార్చి 6: సారిపల్లి గ్రామంలో జల్‌జీవన్ మిషన్, వెల్‌నెస్ సెంటర్, అంగన్‌వాడీ భవనాల ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు బుధవారం ప్రజల నుంచి నిరసన సెగ తగిలింది. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే వద్దకు రిజర్వాయర్ బాధితులు వెళ్లి తమ సమస్యలను పరిష్కరించాలని, ఇచ్చిన హామీలు నెరవేరలేదని తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యకం చేశారు. తారకరామతీర్థ సాగర్ రిజర్వాయర్ నిర్మాణం కారణంగా పొలాలు కోల్పోయి ఉపాధి లేకుండా బిక్కుబిక్కుమంటున్నామన్నారు. బాధిత కుటుంబీకులకు పీఏఎఫ్ ప్యాకేజీ(ప్రాజెక్టు ఎఫెక్టెడ్ ఫ్యామిలీస్) అమలు చేస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు సారిపల్లి బాబూరావు, బోను మహంతి ఆదినారాయణ, గోపాలమూర్తి తదితరులు, బాధితులు ఎమ్మెల్యేకు నివేదించారు. టీడీపీ నాయకులను, స్థానిక వైసీపీ నాయకులు నిలువరించేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో ఇరువర్గాల వారి మధ్య ఘర్షణ చిలికి చిలికి గాలివానలా మారి తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఎమ్మెల్యేను ప్రశ్నించకుండా సర్పంచ్ పైడమ్మ భర్త రాయి విభీషణరావు అడ్డుతగలడంతో టీడీపీ నాయకులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్ ఎన్నికల సమయంలో పీఏఎఫ్ ప్యాకేజీ అమలు కాకపోతే ఆరు నెలల్లో తాను పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారని, తక్షణమే సర్పంచ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కలుగజేసుకుని అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు వచ్చినప్పుడు గొడవలు సరికాదని సర్దిచెప్పారు. దీంతో నాయకులు మరో ప్రారంభోత్సవానికి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పోలింగ్ ప్రక్రియలపై అవగాహన ఉండాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్‌వోలతో కలెక్టర్ నాగలక్ష్మి



కలెక్టరేట్, మార్చి 6: పోలింగ్ ప్రక్రియపై సంపూర్ణ అవగాహన ఉండాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. పోలింగ్ ప్రక్రియ, నామినేషన్లను దాఖలు చేసే విధానం, సువిధ యాప్‌లో దరఖాస్తు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్‌వోలు, నోడల్ అధికారులతో కలెక్టరేట్‌లో బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకూ జిల్లాలోని 1172 ప్రదేశాల్లో మొత్తం 1847 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 11 పోలింగ్ కేంద్రాలను మోడల్ పోలింగ్ స్టేషన్లగా రూపొందించినట్లు తెలిపారు. వీటిలో రెండింటినీ యువత, 7 కేంద్రాలను మహిళలు, మరో రెండు పోలింగ్ స్టేషన్లను దివ్యాంగులే పూర్తిగా నిర్వహిస్తారని, ఆయా వర్గాల్లో స్ఫూర్తి నింపి ఓటింగ్ శాతాన్ని పెంచాలనేది లక్ష్యమని తెలిపారు.

90 నిమిషాల ముందు మాక్ పోలింగ్

ఎన్నికల శిక్షణల నోడల్ అధికారి సుధాకరరావు మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ మొదలవ్వడానికి 90 నిమిషాలు ముందే మాక్ పోలింగ్ నిర్వహిస్తారని చెప్పారు. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివి ప్యాట్‌లను కలిపి ఒక ఈవీఎం యూనిట్‌గా పరిగణిస్తారని, వీటిలో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్లలో ఏ ఒక్కటి పనిచేయకపోయినా మొత్తం యూనిట్ మారుస్తారని చెప్పారు.

ప్రజా ఫిర్యాదుల వ్యవస్థలపై అవగాహన

జిల్లాలోని ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రజలు, అభ్యర్థులు, పార్టీల నుంచి ఫిర్యాదులు నమోదు చేసేందుకు ఏర్పాటు చేసిన వ్యవస్థలపై స్వీప్ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించాలని కలెక్టరు నాగలక్ష్మి ఆదేశించారు. కంట్రోల్ రూంలు, ఫోన్ నెంబర్లు, ఆన్‌లైన్ ఫిర్యాదుల నమోదుకు గల ఏర్పాట్లు తదితర అంశాలను ప్రజలందరికీ తెలిసేలా చూడాలని స్వీప్ నోడల్ అధికారి, హౌసింగ్ పీడీకి సూచించారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్నలలితకుమారి

టీడీపీ గెలుపును ఎవరూ ఆపలేరు

● 50 ఏళ్లకే బీసీలకు పింఛన్ జస్ట్ శాంపిల్ మాత్రమే ● ముందుంది అసలైన మేనిఫెస్టో ● టీడీపీ నాయకుల ప్రచారం

'వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన గెలుపును ఎవరూ ఆపలేరు. 50 ఏళ్లకే బీసీలకు పింఛన్ జస్ట్ శాంపిల్ మాత్రమే. పూర్తిస్థాయి మేనిఫెస్టో ఇంకా ముందుంది. దీన్ని చూశాక వైసీపీ పోటీ చేయడం మానేస్తుంది. ఇక వైసీపీ పని అయిపోయినట్లే. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేసి దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను నెంబర్‌వన్‌గా మారుస్తారు.' అని టీడీపీ నాయకులు తెలిపారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం: లలితకుమారి

శృంగవరపుకోట: టీడీపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. బుధవారం శృంగవరపుకోట పుణ్యగిరి రోడ్డులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 50 ఏళ్లు నిండిన బీసీలకు నెలకు రూ.4వేలు పింఛన్ అందిస్తామని తెలిపారు. వారి రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామన్నారు. బీసీ సబ్‌ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్లు ఖర్చుచేస్తామన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్‌ను 34శాతానికి పెంచుతామని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు, జయహో బీసీ డిక్లరేషన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, నాయకులు కొణదం మల్లేశ్వరరావు, చెక్క కిరణ్ కుమార్, కాపుగంటి వాసు, అనకాపల్లి చెల్లయ్య, నానిగిరి రమణాజీ, సాయిరాం తదితరులు వున్నారు.

500 కుటుంబాలు చేరిక

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు గ్రామంలో వైసీపీకి చెందిన ఎంపీటీసీ చిన్నమ్మలు, వైస్ సర్పంచ్ తమ్మిరెడ్డి వెంకటరమణ, పలువురు వార్డు మెంబర్లు ఇలా మొత్తం 500 కుటుంబాలు బుధవారం టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఉద్దవోలును అభివృద్ధి పథంలో నడిపిస్తామని వారు హామీ ఇచ్చారు. బేబీనాయన, తెంటుకు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగాల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అమరాపు సురేష్, మాజీ ఎంపీపీ బోడెల సింహాచలం, నాయకులు యుగంధర్, అచ్యుతరావు, సింహాచలం మాష్టారు, పాల్గొన్నారు.


తెర్లాం: పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న బేబీనాయన

విజయబావుటా ఎగురవేస్తాం: బేబీనాయన

బొబ్బిలి: వచ్చే ఎన్నికల్లో విజయబావుటా ఎగురవేస్తామని టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన అన్నారు. జనసేన ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి ఆధ్వర్యంలో స్థానిక కోవెల సెంటరులో నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన పార్టీ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ- రెండు పార్టీల శ్రేణులు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు ఆదాడ మోహనరావు, పెద్దింటి మనోజ్‌కుమార్, రాంబార్కి శరత్‌బాబు, గెంబలి శ్రీనివాసరావు, వాసిరెడ్డి సత్యనారాయణ, సుంకరి సాయిరమేష్, కాకల వెంకటరావు, వీరమహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

మద్దతు ఇవ్వండి: అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి అదితి గజపతిరాజు బుధవారం విజ్జీ స్టేడియంలో క్రీడాకారులు, వాకర్స్ క్లబ్ సభ్యులను కలిశారు. వచ్చే ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఆమె వెంట టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, నాగరాజు, కిల్లాన మహేష్, వైద్యుడు గజపతిరాజు ఉన్నారు. ● విజయనగరం మండల పరిధిలోని బడుకొండ పేటలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమాన్ని అదితి గజపతిరాజు బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, వేచలపు శ్రీను, పి.రాజేష్‌వర్మ, బడుకొండ రామారావు, ఎం.నారాయణప్పడు, తదితరులు పాల్గొన్నారు.


విజయనగరం రూరల్: వాకర్స్, క్రీడా సంఘాల ప్రతినిధులతో అదితి గజపతిరాజు

వైసీపీ పని అయిపోయింది: గొంప కృష్ణ

శృంగవరపుకోట రూరల్: వైసీపీ పని అయిపోయిందని, వచ్చే ఎన్నికల్లో టీడీపీదే విజయమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. బుధవారం అలుగుబిల్లి గ్రామంలో బోరును ప్రారంభించారు. మరో 60రోజుల్లో తెలుగుదేశం పాలన రాబోతుందని తెలిపారు. 50ఏళ్లు నిండిన ప్రతి బీసీకి రూ.4వేలు పింఛన్ అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరమ్మ, విశాఖ టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు రాయవరపు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కడుబండిని ఓడిస్తాం


మాట్లాడుతున్న ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ సంతోషి

శృంగవరపుకోట: ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావును వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓడిస్తామని ఎస్.కోట ఎంపీపీ సండి సోమేశ్వరరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, ఎంపీటీసీ వాకాడ సింహాచలం, నాయకులు బోజంకి గోవింద, మోపాడ గౌరినాయుడు, వెంకటరావులు పేర్కొన్నారు. బుధవారం ఎస్.కోటలో విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తీరునచ్చకే టీడీపీలో చేరామన్నారు. ఈ సారి ఎన్నికల్లో ఎమ్మెల్యే కడుబండికి డిపాజిట్ కూడా రాదన్నారు. వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ

పుణ్యగిరి జాతరకు ప్రత్యేక బస్సులు

శృంగవరపుకోట: మహాశివరాత్రి సందర్భంగా శృంగవరపుకోట పుణ్యగిరికి, సన్యాసయ్యపాలేనికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం రమేష్ తెలిపారు. శుక్రవారం ఉదయం 4.30 గంటల నుంచి శనివారం సాయంత్రం వరకు ఈ బస్సులు తిరుగుతాయన్నారు. పుణ్యగిరికి 15 బస్సులు, సన్యాసియ్యపాలేనికి 3 బస్సులు మొత్తం 18 ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. శుక్రవారం రాత్రి మెత్తం పుణ్యగిరి కొండకు బస్సులు ఉంటాయన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి జడ్పీహైస్కూల్లో 10వతరగతి చదువుకుంటున్న విద్యార్థులకు పరీక్షలకు ఉపయోగపడే మెటీరియల్, ప్లాంకులు, స్కేల్స్, పెన్నులు పంపిణీ చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ యూత్‌కు చెందిన సభ్యులు 40 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు తాము పంపిణీ చేసిన మెటీరియల్ బాగా ప్రయోజనకరంగా ఉంటుందని యూనిట్ సభ్యులు తెలిపారు.

కష్టపడి చదువుకోవాలి

కొత్తవలస: కష్టపడి చదువుకుని మంచి మార్కులు సాధించి పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని వియ్యంపేటలోని జీఎంసీ బాలయోగి గురుకుల బాలికల పాఠశాల, వియ్యంపేట జడ్పీ హైస్కూళ్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రెండు పాఠశాలల్లోని 10 తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షలకు విద్యార్థులను తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మస్టర్లలో తేడాలు సహించేది లేదు

రేగిడి: ఉపాధి పనుల్లో వేతనదారుల మస్టర్లలో తేడాలు సహించేది లేదని, ఒకరికి బదులు ఇంకొకరిని పనికి అనుమతించకూడదని, ఉపాధి ఏపీవో హరినాథ్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. మండలంలో కందిశలో కరకొట్టివానిచెరువుకు జరుగుతున్న ఉపాధి పనిని ఏపీవో హరనాథ్ తనిఖీ చేశారు. పనిప్రదేశంలో 223 మంది వేతనదారుల హాజరును గమనించిన ఆయన వేతనదారుల హాజరుపై పరిశీలన చేశారు. కొలతల ప్రాప్తికి రెండు పూటలా పనిచేస్తే రూ. 272లు వేతనం గిట్టుబాటు ఉంటుందని, ఆ మేరకు పనులు చేయాలని సూచించారు. ఎఫ్ఏ యశోద, మేటీలు ఉన్నారు.

'మిచింగ్' బాధిత రైతులకు పెట్టుబడి రాయితీ

కలెక్టరేట్: జిల్లాలోని 2023లో మిచింగ్ తుపాన్ కారణంగా 297.77 హెక్టార్ల విస్తీర్ణంలో పంటకు నష్టం జరగడంతో జిల్లాలోని 1059 మంది రైతులకు రూ. 50.62 లక్షలు పెట్టుబడి రాయితీని సీఎం జగన్ బుధవారం పెట్టుబడి రాయితీని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ భావన తదితరులు ఉన్నారు.

ఎస్ఎస్‌సీ పరీక్ష పత్రాలు డిపాజిట్

రేగిడి: ఎస్ఎస్‌సీ పరీక్ష ప్రశ్నపత్రాలు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డిపాజిట్ చేసినట్లు ఎంఈవో వరప్రసాదరావు తెలిపారు. మండలంలో రేగిడి, సంకిలి, లక్ష్మీపురం, అంబాడ వెంకటాపురం హైస్కూళ్లు పరీక్ష క్రేంద్రాలుగా ఎంపిక కాగా, వీటిలో 660 మంది పిల్లలు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో వెల్లడించారు. పత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచినట్లు ఎంఈవో తెలిపారు.

ఆశ్రమ పాఠశాలలో మహిళా దినోత్సవం

బొబ్బిలి: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో బుధవారం సాయంత్రం యూటీఎఫ్ రాష్ట్ర మహిళా నేత కె.విజయగౌరి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజయగౌరి మాట్లాడుతూ రాజ్యాంగ పరంగా సంక్రమించిన హక్కులను మనమంతా చైతన్యంతో దక్కించుకోవాల్సిన అవసరం ఉందని, దీనికి విద్య ఒక్కటే ఆయుధమన్నారు. అనంతరం విద్యార్థులకు మహిళలకు సంబంధించిన సమాచారంతో కూడిన పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షర్మిల సభను విజయవంతం చేయండి

రాజాం: వచ్చేవారం విశాఖపట్నంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి కోరారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించి నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాల నుంచి ప్రజలు భారీగా హాజరయ్యేలా నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మండలాల అధ్యక్షులు కృషి చేయాలన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు సరగడ రమేష్, రాజాం నియోజకవర్గం ఇన్‌చార్జి రాష్ట్ర ఎస్సీ సెల్ వైస్‌చైర్మన్ కంబాల రాజవర్దన్, మండల పార్టీ అధ్యక్షులు దేశి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కోండ్రు

రాజాం, మార్చి 6: అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ బుధవారం శ్రీకారం చుట్టారు. ముందుగా శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో గ్రామదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పోలిపల్లి పైడితల్లి అమ్మవారిని, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న నవదుర్గ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పొగిరి గ్రామం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. బీసీ డిక్లరేషన్‌ను నాయకులు ప్రతి ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. బీసీ డిక్లరేషన్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కోండ్రు మీడియాతో మాట్లాడుతూ బీసీల బాంధవుడు నారా చంద్రబాబునాయుడని, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే 50 సంవత్సరాలకు పెన్షన్‌ను అమలు చేసి రూ.4వేలకు పెంచుతామన్నారు. అలాగే ఆర్థిక అభివృద్ధి ఉపాధికి ప్రోత్సహకాలు పునరుద్ధరిస్తామన్నారు. ముందుగా గ్రామంలో ప్రజలు మంగళ హారతులు ఇచ్చి గ్రామంలోకి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుమల వెంకట మన్మథరావు, పట్టణ అధ్యక్షుడు సూర్యప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు


పొగిరిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కోండ్రు

● శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల నాయకులతో ఎన్నికల ప్రచారం సన్నాహక కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. అనంతరం కోండ్రు మురళీ మాట్లాడుతూ సీఎం జగన్ రెడ్డి పాలనలో వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు

విద్యార్థులు సన్మార్గంలో నడవాలి

విజయనగరం క్రైం: విద్యార్థులు సన్మార్గంలో నడవాలని, ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకోవాలని విజయనగరం డీఎస్పీ గోవిందరావు అన్నారు. బుధవారం ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2, 3 సహకారంతో డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా కార్యాలయ ఆవరణలోనూ, ఇంటి ఆవరణలోనూ మొక్కలు నాటాలన్నారు.


మొక్కలు నాటుతున్న డీఎస్పీ

ఎన్నికల కోడ్ రాకముందే ఇళ్లు అప్పగిద్దాం

● తాళం చెవి ఇవ్వకుండానే బ్యాంకుల నుంచి నోటీసులంటూ ఫిర్యాదులు
● టిడ్కో కాలనీలో ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: టిడ్కో ఇళ్లకు సంబంధించిన తాళం చెవి అప్పగించకుండానే మా అందరికీ బ్యాంకు రుణాల అప్పులు తీర్చాలని నోటీసులు వస్తున్నాయని లబ్ధిదారులంతా ఫిర్యాదులు చేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు వ్యాఖ్యానించారు. స్థానిక టిడ్కో కాలనీలో 3.71 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. విద్యుత్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ రాకమునుపే లబ్ధిదారులకు రెండు మూడురోజుల్లోగా ఇళ్లను అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారుల ఒప్పుకుంటే ఈ ఇళ్లను ఎలా ఉన్నా ఇప్పటికిప్పుడే ఇచ్చేద్దామని అన్నారు. టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ మాట్లాడుతూ రివర్స్ టెండరింగ్ కారణంగా ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరిగిందన్నారు. అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. బొబ్బిలిలో 1270 ఇళ్లను అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. టిడ్కో ఈఈ జ్యోతి, విద్యుత్ ఈఈ ఎ.అనంతరావు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు, కమీషనరు లాలం రామలక్ష్మి, వైస్‌చైర్మన్లు చెలికాని మురళీకృష్ణ, తెంటు పార్వతి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కళాభారతి ఆడిటోరియంలో ఏసీ సదుపాయం

బొబ్బిలి: స్థానిక కళాభారతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఏసీ సదుపాయాన్ని బుధవారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ప్రారంభించారు. కళాభారతి ఉపాధ్యక్షుడు నంబియార్ వేణుగోపాలరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొలుత బాలకళాకారులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ప్రముఖ కళాపోషకుడు కర్రి సత్యనారాయణ ఇటీవల డాక్టరేట్‌ను అందుకోవడంతో ఆయనను ఘనంగా సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, సంస్థ అధ్యక్షుడు సిద్దా సత్యనారాయణ, ఇతర ప్రతినిధులు డాక్టర్ కేవీ అప్పారావు, చెలికాని చెల్లారావు, రౌతు రామ్మూర్తి, పుల్లెల శ్రీనివాసరావు, డీవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టెట్ పరీక్షలు

కలెక్టరేట్: జిల్లాలో జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష బుధవారంతో ముగిసింది. గతనెల 27 నుంచి ఇప్పటి జరిగిన పరీక్షకు 11,580 అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 10,429 మంది హాజరయ్యారు.

హోటల్ రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

విజయనగరం రింగురోడ్డు, మార్చి 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హోటళ్ల రంగాన్ని ఒక పరిశ్రమగా గుర్తించి ఆదుకోవాలని హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్వీ స్వామి డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఒక హోటల్‌లో హోటల్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తున్న హోటల్ రంగం నేడు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని, ప్రభుత్వాలు హోటల్స్ రంగాన్ని పరిశ్రమగా గుర్తించి రాయితీలు, సౌకర్యాలు కల్పించాలన్నారు. రాత్రి పూట ప్రయాణం చేసే ప్రయాణికుల సౌకర్యార్థం హోటల్స్‌ని అర్ధ రాత్రి వరకూ తెరిచి ఉంచేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. హోటల్ రూంలకు జీఎస్టీ తగ్గించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి రఘువీర్ శెనాయ్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి గుడిశ శివకుమార్, పూర్ణచంద్, హోటల్ యాజమానులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్వామి

శ్రీశైలం తలపాగా ఊరేగింపు

రాజాం: రాజాం పట్టణ వాసీ చల్ల జయరాం దంపతులు శ్రీశైలం మల్లన్న తలపాగాను గత కొంతకాలంగా తయారు చేశారు. శివరాత్రి సందర్భంగా తలపాగాను మల్లనకు అందించడానికి బుధవారం పట్టణంలో ఊరేగించి ప్రత్యేక వాహనంలో బయలుదేరి వెళ్లారు. అక్కడ కనకదుర్గ అమ్మవారికి చూపించి అమ్మవారిని దర్శించుకొని అక్కడ నుంచి శ్రీశైలం బయలుదేరి వెళ్తామని జయరాం దంపతులు తెలిపారు.


తలపాగాను ఊరేగిస్తున్న దృశ్యం

సంకిలిలో సంగిడీ పోటీలు

రేగిడి, మార్చి 6: మండలంలో సంకిలికి చెందిన వారడ పట్టాభినాయుడు స్మారకార్థం బుధవారం జిల్లాస్థాయి సంగిడీ (వస్తాదు) పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు నిర్వాహకులు అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. పలు విభాగాల్లో నిర్వహించి న పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 20 మంది వరకూ వస్తాదులు పాల్గొని తమ సత్తా నిరూపించుకున్నారు. ● 180 కేజీల సింగిడీ రాయి విభాగంలో పొలాకి మండలం చింతువానిపేటకు చెందిన అవాల వసంతరావు ప్రథమస్థానంలో నిలిచాడు. 160 కేజీల విభాగంలో శ్రీకాకుళం మండలం ఒప్పంగికి చెందిన గేదల సత్యనారాయణ ప్రథమ స్థానం, ఒంటిచేతితీతలో పొందూరు మండలం రాపాకకు చెందిన రజాక్ ప్రథమ స్థానం సాధించాడు. వీరికి దివంగత పట్టాభినాయుడు తనయుడు గౌతమ్ ట్రాన్స్‌పోర్టు నిర్వహకుడు వారడ శ్రీనివాసరావు తదితరులు బహుమతులు అందించారు. ఈపోటీలు తిలికించేందుకు పరిసర గ్రామాల ప్రజలు హాజరయ్యారు.


విజేతలకు ప్రైజ్‌మనీ అందిస్తున్న నిర్వాహకులు

పంచాయతీ తీర్మానంతోనే ఆశావర్కర్ నియామకం

● టీడీపీ నాయకుల డిమాండ్
● ఆరికతోట పీహెచ్‌సీ ఎదుట ఆందోళన

రామభద్రపురం, మార్చి 6: మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో ఖాళీగా ఉన్న ఆశావర్కర్ పోస్టును గ్రామ పంచాయతీ తీర్మాణం మేరకే భర్తీ చేయాలని తెలుగుదేశం నాయకుడు, నర్సాపురం సర్పంచ్ కోట వెంకటనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆరికతోట పీహెచ్‌సీ వద్ద కొంతమంది గ్రామస్థులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో ఆశావర్కర్ మృతిచెందడంతో అప్పటి నుంచి ఈ పోస్టును భర్తీ చేయకుండా కాలయాపన చేయడమే కాకుండా పంచాయతీ తీర్మాణం, నోటిఫికేషన్ ఇవ్వకుండా అధికార పార్టీకి చెందిన కొంతమంది కుట్రలు చేస్తున్నారని, అధికారులు మాత్రం నిబంధనల మేరకే ఆశావర్కర్ పోస్టు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి దీపక్‌కు వినతిపత్రం అందించారు. దీనిపై వైద్యాధికారి మాట్లాడుతూ ఈ వినతిపత్రాన్ని డీఎంఅండ్‌హెచ్‌వో ఆఫీసుకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మరిపి కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కోట ఆదినారాయణ, మరికొంత మంది కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు, గ్రామస్థులు

మహిళలు శక్తివంతమవ్వాలి

● మహిళా దినోత్సవ వేడుకల్లో ఆర్డీవో సాయి శ్రీ

బొబ్బిలి, మార్చి 6: నేటి ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాల్లో కీలక భూమిక పోషిస్తున్నారని, మనమంతా ఎంతో శక్తిమంతులమైతే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని బొబ్బిలి ఆర్డీవో ఆదిమూలం సాయి శ్రీ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో పీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత మహిళా అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఇంతులకు ఇష్టమైన రంగంలో రాణించేందుకు అన్ని రకాలుగా ప్రోత్సాహం అందించాలన్నారు. బాల్యదశ నుంచి కౌమార దశ వరకు ఆడపిల్లలకు సరైన మార్గదర్శకత్వం ఉండాలన్నారు. మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి మాట్లాడుతూ పూర్వకాలంలో మహిళలను వంటిల్లు కుందేలుగానే పరిమితం చేసేవారని, ఇప్పుడు బాలికలకు ఇష్టమైన అంశాల్లో తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారన్నారు. ఎంపీపీ శంబంగి లక్ష్మి, జడ్పీటీసీ సంకిలి శాంతకుమారి మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్‌ల వల్ల స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కాగలిగామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన వారికి ఆర్డీవో చేతుల మీదుగా బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవి కుమార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మహిళా అధికారులు

కొట్టి చంపి.. రోడ్డు ప్రమాదమని చెప్పి

● గృహిణి మృతి కేసులో వెలుగు చూసిన దారుణం
● భార్యపై అనుమానంతో భర్త ఘాతుకం

బొబ్బిలి, మార్చి 6: భార్యను చంపి, రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం రాత్రి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మలిరెడ్డి నాగేశ్వర రావు ఈ కేసుకు సంబంధించిన పూర్వాపరాలను వివరించారు. బొబ్బిలి మండలం కమ్మవలస గ్రామానికి చెందిన పాతినవలస తవిటినాయుడు, భార్య లక్ష్మి తరచూ గొడవలు పడుతుండేవారు. గ్రామపెద్దల సమక్షంలో వారి తగాదాలను తాత్కాలికంగా పరిష్కరించేవారు. వారికి 9, 11 ఏళ్ల ఇద్దరు కుమారులున్నారు. ఈ క్రమంలో గత నెల 17న బొబ్బిలిలో సెంట్రింగ్ పని నిమిత్తం కమ్మవలస నుంచి వచ్చిన తవిటినాయుడు కొద్ది సేపటికే మళ్లీ కమ్మవలసలోని తన ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో తన ఇంటికి చెందిన అన్ని తలుపులు, కిటికీలు మూసి ఉండడంతో అనుమానంతో భార్యతో గొడవపడ్డాడు. గత నెల 20న పొరుగున కొండదేవుపల్లి గ్రామంలో భీష్మఏకాదశి పూజల కోసం బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రాత్రి సొంతూరుకు వచ్చేశారు. అదే రోజు రాత్రి భార్యను మూడు రోజుల క్రితం జరిగిన ఘటనపై నిలదీయడంతో వారిద్దరి మధ్య వివాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో తవిటినాయుడు భార్య లక్ష్మిని రాడ్‌తో తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. వెంటనే తన తమ్ముడుకి విషయం చెప్పడంతో వారంతా తెల్లవారుజామున రెండు గంటల సమయంలో ఆటోలో బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయాలకు కారణం ఏమిటని డాక్టర్ అడగడంతో రోడ్డు ప్రమాదం జరిగిందని గాయపడ్డ లక్ష్మి చెప్పడంతో ఆయన ప్రాథమిక చికిత్స చేసి విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మెలకువలోకి వచ్చిన లక్ష్మి జరిగిన ఘటన చెప్పకుండా దాచిపెట్టింది. ఈ లోగా ఆమె తల్లి గొట్ల నారాయణమ్మ, సోదరుడు భాస్కరరావు ఆసుపత్రికి చేరుకుని ఆరా తీయడంతో ఆమె జరిగిన విషయాలన్నిటినీ చెప్పింది. వృద్ధురాలు, పేదరాలైన తల్లి నిస్సహాయురాలై, ఈ విషయాలను ఎవ్వరికీ చెప్పకుండా పిల్లల కోసం గోప్యంగా ఉంచింది. లక్ష్మికి సర్జరీ చేసిన తరువాత గత నెల 23న ఆమె ఆసుపత్రిలో కన్నుమూసింది. ఆ వెంటనే భర్త భయంతో అక్కడ నుంచి పరారయ్యాడు. గత నెల 24న శవపంచనామా జరిపి పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. గ్రామస్థులు, బంధువుల నుంచి విషయాన్ని ఆరా తీశారు. అప్పటి నుంచి అతని కోసం పోలీసులు గాలింపు ప్రారంభించారు. గ్రామ వీఆర్వో వాడాడ ప్రమీల సమక్షంలో బుధవారం తవిటినాయుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. దీనిపై నిందితుడిని బుధవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ కేసులో ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ పూర్తి స్థాయి విచారణ చేసినట్లు ఆయన తెలిపారు.


మాట్లాడుతున్న సీఐ నాగేశ్వరరావు, ఎస్ఐ చదలవాడ

మద్యం సీసాలు స్వాధీనం

రేగిడి: మండలంలోని లచ్చరాయపురం సెంటర్‌లో బుధవారం నాయిరాలవలసకు చెందిన బెజ్జిపురపు శ్రీకాంత్ 52 మద్యం బాటిళ్లతో పట్టుబడినట్లు రాజాం ఎస్ఈబీ సీఐ శ్రీధర్ తెలిపారు. మద్యాన్ని సీజ్‌చేసి నిందుతుడిని అరెస్టు చేసినట్లు సీఐ వెల్లడించారు. ఎక్కడ ఈ తరహా అక్రమ చర్యలు ఉన్నా ఉపేక్షించేది లేదని సీఐ వెల్లడించారు. ఈ తనిఖీలో ఎస్ఈబీ ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు. ● మండలంలో ఉంగరాడమెట్ట సెంటర్‌లో లచ్చన్నవలస గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి 10 మద్యం బాటిళ్లు స్వాధనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ సూర్యారావు తెలిపారు. నిందితుడు అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకొని అరెస్టు చేశామన్నారు. తనిఖీలో సిబ్బంది శివ, బుల్లిబాబు ఉన్నారు.

పట్టుబడ్డ మద్యం సీసాలు ధ్వంసం

విజయనగరం క్రైం: విజయనగరం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో పట్టుబడ్డ 272 మద్యం సీసాలను బుధవారం సెబ్ డీఎస్పీ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. విజయనగరం రూరల్ పరిధిలో 2023-24 సంవత్సరంలో వివిధ ప్రదేశాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను రూరల్ ఎస్ఐ వాసుదేవ్ సిబ్బంది ఆధ్వర్యంలో పట్టుకున్నారు. వీటిని బుధవారం మధ్యవర్తుల సమక్షంలో సెబ్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు

విజయనగరం క్రైం: వాహనదారులు మైనర్లకు వాహనాలు ఇస్తే, తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని ట్రాఫిక్ సీఐ రంగనాథం హెచ్చరించారు. మంగళవారం రాత్రి కోట జంక్షన్‌లో వాహనాలు నడుపుతూ, పట్టుబడ్డ మైనర్లకు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేని మైనర్లకు వాహనాలు ఇవ్వడంతో ప్రమాదాలు అధికమౌతున్నాయన్నారు. నగరంలో రోజూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని, తనిఖీల్లో పట్టుబడితే, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐలు లోవరాజు, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని పట్టణాల్లో రైతు బజార్ల ఏర్పాటుకు చర్యలు

బొబ్బిలి, మార్చి 6: అన్ని ప్రధాన పట్టణాల్లో రైతుబజార్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్ తెలిపారు. స్థానిక వ్యవసాయమార్కెట్ కమిటీ(ఏఎంసీ) ఆధ్వర్యంలో బుధవారం నుంచి నూతనంగా వారపుసంతను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా జేడీ సుధాకర్ మాట్లాడుతూ తమ పరిధిలో 61 ఏఎంసీలు ఉన్నాయని, వాటి ద్వారా 163 కోట్ల రూపాయల మార్కెట్ ఫీజు వసూలు లక్ష్యమన్నారు. తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో ఏఎంసీలు నిత్యం రైతులు, వ్యాపారులతో కళకళలాడుతాయన్నారు. మన ప్రాంతంలో మాత్రం ఏఎంసీలు అధ్వానంగా ఉంటాయన్నారు. బొబ్బిలిలో రైతు బజారు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చామన్నారు. ఏఎంసీలలో బయట వ్యక్తులు వ్యాపారాలు కొనసాగించుకునేందుకు నామమాత్రపు ఫీజుతో అనుమతి ఇస్తామన్నారు. రైతులకు-పశువులకు ఉన్న అవినాభావసంబంధాన్ని మరింత బలపరిచేందుకు వారపు సంతలు మంచి వేదికగా ఉంటాయని ఆయన అన్నారు. ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ తెలంగాణలో మాదిరిగా మన రాష్ట్రంలో ఏఎంసీలు అంతగా సద్వినియోగం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్లు మజ్జి శ్యామ్‌సుందర్, బి.రవికిరణ్, ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, వైస్‌చైర్మన్లు గొలగాని రమాదేవి, చెలికాని మురళీకృష్ణ, తెంటు పార్వతి, డైరెక్టర్లు, కార్యదర్శి శ్రీనివాసరావు, తమ్మిరెడ్డి దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగమంటే ఇంత లెక్కలేనితనమా?

● ఏ మండలంలో కూడా ఈ పరిస్థితి లేదు

● డ్వామా పీడీ ఆగ్రహం ● బుచ్చిరాజుపేట ఎఫ్ఏ సస్పెన్షన్‌కు ఆదేశాలు

మెంటాడ: 'దేనికీ లెక్కల్లేవ్. ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అంతటా అక్రమాలే. అడుగడుగునా అవకతవకలే. ఉద్యోగమంటే ఇంత లెక్కలేనితనమా?.' అని మం డలంలోని ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందిపై జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాపరమేశ్వరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో బుధవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. పిట్టాడ, చల్లపేట, మీసాలపేట, ఆండ్ర గ్రామాల్లో వెల్‌నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు నిర్మాణాలకు సంబంధించి రూ.8 లక్షల విలువ చేసే ఐరన్, సిమెంట్ వినియోగంలో అవకతవకలు జరిగినట్టు విచారణలో తేలింది. ఈ పనులు జరగకపోవడంతో పాటు ఇప్పటి వరకు ఎం.బుక్‌లు అప్పగించపోవడంపై పీడీ అసహనం వ్యక్తం చేశారు. కుంతినవలస గ్రామంలో రూ. 15 లక్షల అంచనా వ్యయంతో 300 మీటర్ల పొడవునా రోడ్డు వేయాల్సి ఉండగా కేవలం 30 మీటర్లే వేయడం ఏంటని ఆగ్రహించారు. ఇదే గ్రామంలో 600 మొక్కలు నాటినట్టు రికార్డుల్లో చూపించగా క్షేత్రస్థాయిలో 350 మొక్కలు ఉండడంపై సంజాయిషీ అడిగారు. సీఎం పర్యటన సందర్భంగా అధికారులు 250 మొక్కలు కట్ చేశారని స్థానిక సిబ్బంది సమాధానంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆండ్రలో రూ.8లక్షలతో గ్రావెల్ రోడ్డుకు సంబంధించిన ఎం.బుక్ అందజేయపోవడంతో మతలబు ఏంటని ప్రశ్నించారు. లోతుగెడ్డ పంచాయతీ కొండవర్తిలో ఓ నేతకు 250 హార్టికల్చర్ మొక్కల విషయంలోనూ అనుమానాలున్నాయని వ్యాఖ్యానించారు. పోరాం గ్రామం లో రూ.3 లక్షల పనులకు మస్తర్లు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఇంకా పలు గ్రామాల్లో అవకతవకలు చోటుచేసుకున్నట్టు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. పలువురు క్షేత్రసహాయకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుచ్చిరాజుపేట ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఏపీవో హరినాథ్‌రావు పనితీరుపై మండిపడ్డారు. క్రిమినల్ కేసులు ఎందుకు పెట్టకూడదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి: ఆర్వో



మాట్లాడుతున్న సూర్యకళ

గజపతినగరం: రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల అధికారులు నిబంధనలు పాటించాలని రిటర్నింగ్ అధికారి(ఆర్వో) ఎంపీ సూర్యకళ తెలిపారు. బుధవారం గజపతినగ రంలో సెక్టార్, బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ ఎన్‌వీ ప్రభాకరరావు, ఎన్నికల ఉపతహసీల్దార్ సతీష్ పాల్గొన్నారు.

గోసంరక్షణకు కృషిచేయాలి: సీఐ

గజపతినగరం: గోసంరక్షణ, సంక్షేమానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీఐ ఎన్‌వీ ప్రభాకరరావు తెలిపారు.బుధవారం గజపతినగరం సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ సమైక్య రూపొందించిన గోమాత చిత్ర పటంతో పాటు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ గోసంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిస రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గసభ్యులు సత్యనారాయణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాజకుమారి, జిల్లా ఉపాధ్యక్షురాలు పైడితల్లి పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

చీపురుపల్లి: మహిళలు అన్ని రంగాల్లో మరింత రాణించాలని ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ ఆకాంక్షించారు. బుధవారం స్థానిక సీడీపీవో కార్యాలయంలోఅంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీతో బాటు ఎంపీడీవో డి. శ్వేత, ఉత్తమ సేవలందించిన అంగన్‌వాడీ కార్యకర్త కె. పద్మావతి, సహాయకురాలు సత్యవతిలను సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, సీడీపీఓ ఎస్. రాజరాజేశ్వరిదేవి, ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

కోడూరులో మహిళా దినోత్సవం

గరివిడి: కోడూరులో జనవిజ్ఞాన వేదిక, యూటీఎఫ్ సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సమతా కన్వీనర్ ఎం.సుశీల అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు వి. మోహనరావు, గొర్లె రమణ, సత్యారావు, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి.పద్మావతి, ఎ.సత్య శ్రీనివాస్, గేదెల ఆదినారాయణ, ఉప సర్పంచ్ శంకరరావు పాల్గొన్నారు.

పర్లలో ఆరోగ్య సురక్ష

చీపురుపల్లి: మండలంలోని పర్లలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బొంతు తిరుపతిరావు, ఎల్. ప్రభాత్‌కుమార్, గ్రామ నాయకులు, రాము, పొండ్రంకి జనార్ధన్, అస్సాం కృష్ణ, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు షటిల్ టోర్నమెంట్

చీపురుపల్లి: చీపురుపల్లిలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు నిర్వాహకుల ప్రతినిధి పీసీ స్వరూప్ ఒక ప్రకటనలో తెలిపారు. బెల్లాన సింహాచలం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ టోర్నీలో నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల టీములు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 9885830520 నంబరుకు సంప్రదించాలని కోరారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

దత్తిరాజేరు: అధికారులు,ప్రజాప్రతినిదులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ గేదెల సింహాద్రప్పలనాయుడు తెలిపారు. బుధవారం దత్తిరాజేరులో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాజేశ్వరి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి అప్పలనాయుడు, వైస్‌ఎంపీపీ భమిడి అప్పలనాయుడు, ఎంపీడీవో చంద్రకుమారి పాల్గొన్నారు.

అయ్యన్న అగ్రహారంలో ఇళ్ల పట్టాల పంపిణీ

బొండపల్లి: అయ్యన్నఅగ్రహారంలో బుధవారం ఇళ్లపట్టాలు,పత్రాలను ఎంపీపీ చల్లా చలంనాయుడు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సూర్యప్రకాశరావు, ఎంపీడీవో ఎస్.హరిహరరావు, సర్పంచ్ ఎస్.కసవయ్య, ఎంపీటీసీ సభ్యులు తాళ్లపూడి అప్పలనాయుడు పాల్గొన్నారు. అలాగే అంబటివలసలో ఆరోగ్య సురక్ష-2 వైద్యశిబిరం నిర్వహించారు.

సాంకేతికతలో మార్పులతో ఉద్యోగావకాశాలు

డెంకాడ: సాంకేతిక విద్యలో వస్తున్న విప్లవాత్మక మార్పుల వల్ల కొత్త ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని హైదరాబాద్ మెట్రో రైల్‌కు చెందిన క్యూలిస్ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ వంశీకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని జొన్నాడ వద్దగల లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ విభాగ విద్యార్థి సంఘ వార్షికోత్సవం లక్ష్య 2024 ప్రారంభ మయ్యింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీవీ రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల విజయోత్సవాలు



విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

నెల్లిమర్ల: పారిశుధ్య కార్మికులకు రూ.21వేలు, క్లాప్ డ్రైవర్లకు రూ.24,500 బేసిక్ వేతనం అమలు చేస్తూ ప్రభుత్వ జీవో జారీ చేసిందని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.జగన్మోహనరావు తెలిపారు. బుధవారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద విజయోత్సవ సభ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంజనీరింగ్, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న వారందరికీ జీతం పెంచాలని, అధ్యయన కమిటీ రిపోర్టును అమలు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కె.రామారావు, నాయకులు శ్రీను, హరిబాబు, లక్ష్మి, శంకర్, దుర్గారావు, రాము పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

రామభద్రపురం: కొత్తరేగలో శివాలయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు, కొత్తరేగ సర్పంచ్ కిలపర్తి మురళీ, మల్లంపేట సర్పంచ్ వంగపండు పద్మావతి, నర్సాపురం సర్పంచ్ కోట వెంకటనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివాలయంలో శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

వైసీపీని ఇంటికి పంపించాలి

● బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం



సాలూరు రూరల్: బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న సంధ్యారాణి



కురుపాం రూరల్: కొండబారిడిలో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న జగదీశ్వరి



పార్వతీపురంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారిని ఆహ్వానిస్తున్న బోనెల విజయచంద్ర

రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ఇంటికి పంపించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం ఉమ్మడి జిల్లాలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. పలుచోట్ల వైసీపీ నాయకులు టీడీపీలోచేరారు.

కూలీల బతుకులపై ధరల భారం: సంధ్యారాణి

సాలూరు రూరల్: నిత్యావసర సరుకులు, బస్సు, విద్యుత్ చార్జీలు వైసీపీ ప్రభుత్వం పెంచి కూలీ బతుకులపై భారం మోపిందని సాలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి ఆరోపించారు. సీతం దొరవలస, భరిణికవలస, పెద్దవలస, మూలవలస తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరి గోరుముద్దలు ఎత్తి వేశారని, వ్యవసాయ పనిముట్లు, వడ్డీలేని రుణాలు తదితర వాటికి చరమగీతం పాడారన్నారు.నియోజకవర్గంలో 18 ఏళ్లుగా ఎమ్మెల్యేగా, డిప్యూటీ సీఎం, గిరిజన శాఖ మంత్రిగా రాజన్నదొర ఉన్నా మారుమూల గిరిజన గ్రామాలను ఆయన పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఆముదాల పరమేశు, ఎంపీటీసీ అప్పికొండ రమాదేవి, అక్యాన వెంకట తిరుపతిరావు, శ్యాం పాల్గొన్నారు.

13వ వార్డులో టీడీపీలో చేరిక

పార్వతీపురం ఆంధ్రజ్యోతి:పార్వతీపురంలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయచంద్ర ప్రచారం నిర్వహించారు. మునిసిపాలిటీలోని 13వవార్డులో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారికి ఆహ్వానించారు. 16వ వార్డుతో పాటు వివిధ వార్డుల్లో విజయచంద్ర ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాల గూర్చి వివరించారు.

అభివృద్ధి చేసి చూపిస్తా: విజయచంద్ర

పార్వతీపురంటౌన్: ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని బోనెల విజయచంద్ర తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలక్రీడా మైదానంలో వాకర్స్‌ను కలిశారు. తనను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

సీతానగరం: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని బోనెల విజయ చంద్ర తెలిపారు. రంగంపేటలో బాబు షూరిటీ భవిష్యత్ కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా టీడీపీలో 50 కుటుంబాలు చేరాయి. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాల్‌నాయుడు, గొట్టాపు వెంకట నాయుడు, మాజీ సర్పంచ్ బొంగు భాస్కరరావు, పోల సత్యనారాయణ, పైల నాగభూషణరావు, బి.వెంకటరమణ, బి.చిరంజీవి, మర్రాపు శంకరరావు, రెడ్డి సింహాలరావు పాల్గొన్నారు.

రాబోయేది టీడీపీయే: జగదీశ్వరి

కురుపాం రూరల్:రానున్నది టీడీపీయేనని కురుపాం నియోజకవర్గ టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి తెలిపారు. కొండ బారిడిలో శంఖారావం, సూపర్‌సిక్స్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో టీడీపీ నాయకులు కలిశెట్టి కొండయ్య, రంజిత్‌కుమార్ నాయికో, వెంపటాపు భారతి, సుబ్బలక్ష్మి, సుక్కు, గుజ్జువాయి, మరిపల్లి, ఉదయపురం పంచాయతీల గృహసారథులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



దత్తిరాజేరు: మాట్లాడుతున్న కొండపల్లి శ్రీనివాస్

బీసీ డిక్లరేషన్ అమలు చేస్తాం

గుమ్మలక్ష్మీపురం: టీడీపీ ప్రవేశపెట్టిన బీసీ డిక్లరేషన్ వంద శాతం అమలు చేస్తామని టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి తెలిపారు. కొమ్ములక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడారు. ఆదరణ పథకం అమలు,బీసీలకు రుణాలు, ఇతర వస్తువులు కల్పనకు తాము కట్టుబడి ఉన్నామన్నారు. చంద్రబాబు బీసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నారన్నారు. సమావేశంలో పాడి సుధ, పోలూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసీపీకి ముగింపు పలకడం ఖాయం: శ్రీనివాస్

దత్తిరాజేరు: టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సమ న్వయంతో పనిచేస్తే సునాయాసంగా విజయం సాధించ వచ్చని గజపతినగరం నియోజకవర్గ టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని కోమటిపల్లిలో నిర్వహించిన మండల నాయకులు సమావేశం మాట్లాడారు. వైసీపీ అరాచకాలకు ప్రజలు ముగింపు పలకడం కాయమని, పార్టీకి బుద్ధి చెప్ప డానికి ఎప్పుడు ఎన్నికలు వస్తాయోనని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. తోటపల్లి కాలువ పనులు ప్రారంభించి 17 ఏళ్లు గడిచినా ఇంతవరకు తట్ట మట్టి కూడా పోయలేదని ఆరోపించారు. దత్తిరాజేరులో ప్రభుత్వ జూనియర్ కాలేజీ టీడీపీ హయాంలో తీసుకొచ్చినా, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అట్టహాసంగా ప్రారంభించినా విద్యార్థులకు చదువులు అందడం లేదన్నారు.నియోజకవర్గంలో ఎటువంటికంపెనీలు, యువ తకు ఉపాధిలేవన్నారు. జనసేన నాయకులు మర్రాపు సురేష్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి శ్రీనివాస్ గెలుపునకు అహర్నిశలు పని చేస్తామన్నారు.కార్యక్రమంలో నాయకులు కొండలరావు,మిత్తిరెడ్డి ఈశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, బెజవాడ రాజేశ్వరి, కొల్లి అప్పలనాయుడు, మండల మహిళా అధ్యక్షురాలు గేదెల మంగమ్మ, కస్టర్ ఇన్‌చార్జిలు బెజవాడ బంగారునాయుడు, మజ్జి మహేష్, సీనియర్ నాయకులు చెల్లూరి సత్యారావు, గుసిడి జగన్నాథం పాల్గొన్నారు.

జనసేన పార్టీలో చేరికలు



జనసేనపార్టీలో చేరిన ముంజేరు గ్రామస్థులు

పూసపాటిరేగ(భోగాపురం): భోగాపురం మండలం ముంజేరుకు చెందిన 150 కుటుంబాలు జనసేనలో బుధవారం చేరాయి. వీరిని నెల్లిమర్ల జనసేన అభ్యర్థి లోకం మాధవి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వ అసమర్థపాలనకు విసుగుచెంది జనసేన పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

ఆధునిక సాగు పద్ధతులతో మేలైన దిగుబడులు: ఏడీ



రైతులకు స్ప్రేయర్లు అందజేస్తున్న ఏడీ

చీపురుపల్లి: ఆధునిక సాగు పద్ధతులు అనుసరించడం వల్ల జీడిలో మరింత మేలైన దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాఖ ఏడీ కె. శైలజ తెలిపారు. మండలంలోని పెదన డిపల్లిలో ఎస్సీ సబ్‌ప్లాన్ పథకం కింద భారత వ్యవసాయ పరిశోధనా మండలి, జీడి మామిడి పరిశోధనా సంచా లయం (పుత్తూరు) సహకారంతో జీడి సాగుపై ఎస్సీ రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బ్యాటరీ స్ప్రేయర్లు,ప్రూనింగ్ రంపాలు రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం పెదనడిపల్లి ఆర్బీకేలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉద్యాన శాఖలో కొత్త పద్ధతులు రైతులు అవలంబించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కె.ఉమామహేశ్వరరావు, జి.స్రవంతి, ఉద్యాన శాఖాధికారి సీహెచ్ చంద్రశేఖర్, పీఏసీఎస్ అధ్యక్షుడు పిసిని శ్రీనివాసరావు, ఎంపీటీసీ రేగాన ఆదినారాయణ, సర్పంచ్ సూర పోలరాజు, చినడిపల్లి సర్పంచ్ గడే సత్యవతి పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



పూసపాటిరేగ:సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కుమిలి, రెల్లివలస, చింతపల్లి, తిప్పలవలస గ్రామాల్లో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. డీఎస్పీ గోవిందరావు, భోగాపురం సీఐ వెంకటేశ్వరరావు, స్థానిక ఎస్ఐ సన్యాశినాయుడు, పోలీసు బలగాలు, కేంద్ర పోలీసు బలగాలు పాల్గొన్నాయి.

సమస్యాత్మక గ్రామాల్లో పర్యటన

బొబ్బిలి: బొబ్బిలి మండలంలో సమస్యాత్మక గ్రామాలలో బుధవారం జిల్లా ఏఎస్పి ఆస్మా ఫర్హీన్ పర్యటించారు. పక్కి, పిరిడి, చింతాడ, గొల్లపల్లి, మల్లమ్మపేట లో ఆమె పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో ఆయా గ్రామాలలో శాంతిభద్రతల పరిస్థితులు ఎలా ఉండబోతాయి అన్నదానిపై ఆరా తీశారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో గల మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్, తాగునీరు, రహదారి తదితర వాటిని ఆమె పరిశీలించారు.

రోగులకు అన్నదానం

తెర్లాం: బూరిపేటలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు బూరి అప్పలస్వామినాయుడు మొదటి వర్ధంతి సందర్భంగా రాజాంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు, పొగిరి కుష్టు వ్యాధి ఆసుపత్రిలో రోగులకు, రోడ్డు పక్కన ఉన్న వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. బూరిపేట యుపీపీ స్కూల్‌లో విద్యార్థులకు పెన్నులు, నోటుపుస్తకాలు పంపిణీ చేశారు.

మానవ జీవితం శ్రేష్ఠమైనది

కొత్తవలస: భూమి మీద ఎన్నో జీవరాశులను సృష్టించిన మానవ జీవితం అనేది శ్రీకృష్ణ పరమాత్ముని సృష్టిలో అత్యంత ప్రాధాన్యం కలిగినదని ఇస్కాన్ భక్తి వేదాంత విద్యాపీఠం డీన్ గౌరంగదర్శన్‌దాస్ స్వామిజీ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని మంగళపాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన మానవ జీవితాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన దివ్యాంగుల ఉపకరణాలను తయారు చేసే కర్మాగారాన్ని, గురుదేవ ఆసుపత్రిని పరిశీలించారు. దివ్యాంగులకు అవసరమై ఉపకరణాలను ఆయన దివ్యాంగులకు అందజేశారు. ట్రస్టు వ్యవస్థాపకుడు రాపర్తి జగదీష్‌బాబు మాట్లాడుతూ అందరి ఆశీస్సులతో తాను సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నానని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమశాఖాధికారి గేదేల జగదీష్ బాబు, రూపాకుల రవికుమార్, ఎంపీడీవో రమణయ్య, ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో 'సింపోజియం'

విజయనగరం రూరల్: ఇంజినీరింగు విద్యలోని పలు విభాగాల్లో వస్తున్న అనూహ్య మార్పులను ఎప్పటికప్పుడు విద్యార్థులకు వివరించే క్రమంలో జేఎన్‌టీయూ ఇంజినీరింగు విద్యాసంస్థల్లో ఉన్న ఇంజినీరింగు కోర్సులకు సంబంధించి జాతీయ స్థాయి సదస్సులని నిర్వహించడం జరుగుతున్నదని ఆ కళాశాల వీసీ వెంకట సుబ్బయ్య చెప్పారు. రెండు నెలలుగా దశలవారీగా అన్ని విభాగా ల్లో కూడా సాంకేతిక సింపోజీయం నిర్వహిస్తున్నా మన్నారు. అధ్యాప కులకు కూడా కొత్త విషయాలు తెలుసుకోవడం, వాటిని వెంట, వెంటనే విద్యార్థులకు బోధన ద్వారా వివరిస్తామన్నారు. సైంటిస్ట్ కిషోర్ నాథ్ మాట్లాడుతూ, మెటలర్జీ విభాగం విద్యార్థులు మంచి ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు కార్యక్రమంలో సూర్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీకుమార్, మెటలర్జీ విభాగం అధిపతి మణికుమార్, పవన్‌మాధవ్, ముఖేష్, పూర్ణిమ వ్యవహరించారు.

గిరిజనులు వినూత్న నిరసన

మెంటాడ: తమ భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గిరిజనులు వినూత్నంగా నిరసన తెలిపారు. ఆదివాసీ సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం తలపెట్టిన రిలే నిరహార దీక్షలు మూడో రోజుకు చేరాయి. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు మాట్లాడుతూ.. గిరిజనులకు పట్టాలు ఇపిస్తామని హామీ ఇచ్చిన డిప్యూటీ సీఎం రాజన్నదొర మాట తప్పుతున్నారన్నారు. సర్వే చేసిన అధికారులు పట్టాలు ఇవ్వడంలో విఫలం అయ్యారన్నారు. పాలకులు, అధికారులకు మంచి బుద్ధి కలగాలని కుక్కను వేడుకున్నారు. అనంతరం శునకానికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘనేత సోములు తదితరులు పాల్గొన్నారు.



కుక్కకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన నేతలు